TELANGANA ADDA

RNI: TGTEL/25/A0986

# తెలంగాణ అడ్డా

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యే మా ఆయుధం

PUBLISHED: KARIMNAGAR | సంపుటి : 02 | సంచిక : 49 | శుక్రవారం 04-09-2026 | ఎడిటర్ :- గడ్డి నరేష్, | పేజీలు : 04

రామ మందిర ట్రస్టుకు కొత్త సీఈవో

## స్పందించిన అసదుద్దీన్ ఒవైసీ



2 లో..

- రామ మందిర నిధుల చోరీపై సిట్ నివేదికను బయటపెట్టాలని డిమాండ్
- ప్రజల భక్తిని అపహాస్యం చేసి కోట్లు దోచుకున్నారని విమర్శ
- తెలంగాణ ఓటర్ల జాబితా సవరణలపై ప్రజలకు కీలక సూచనలు
- ఓటర్లను చనిపోయినట్లు తప్పుగా చూపిస్తున్నారని ఆరోపణ

అయోధ్య రామ మందిర నిర్మాణానికి అందిన విరాళాల్లో జరిగిన

## మోదీని అడిగే దమ్ముందా?.. తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్



2 లో..

- మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన
- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్
- తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ
- మెట్రో, నవోదయ, కేంద్రీయ పాఠశాలల అంశాలు ప్రస్తావన
- ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్

# దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు అసద్ తక్కువేమీ కాదు

- ఎంఐఎం దేశ వ్యతిరేకమనేది దుష్ప్రచారమన్న రేవంత్
- ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై అసద్, అక్బర్‌తో చర్చించానని వెల్లడి
- అసద్ సూచించిన అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేయాలని ఆదేశం
- పాతబస్తీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ
- హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించడమే లక్ష్యమని వెల్లడి



2లో

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు అసదుద్దీన్ ఒవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసద్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమంటూ జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై తాను అసదుద్దీన్, అక్బరుద్దీన్‌తో చర్చించినట్లు తెలిపారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాతే పనులు ముందుకు సాగాయని చెప్పారు. ఇన్నేళ్లలో ఎంతమంది ముఖ్యమంత్రులు ఓల్డ్‌సిటీకి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీల్లోకి

36 వేల కి.మీ ఎత్తు

## నుంచి భారత్‌పై నిఘా

ఈఓఎస్-05తో ఇస్రో భారీ ప్రయోగం!



2 లో..

- సెప్టెంబర్ 4న ఈఓఎస్-05 ప్రయోగం
- తెల్లవారుజామున 2.55 గంటలకు లాంచ్
- జీఎస్ఎల్‌వీ-ఎఫ్17తో ఉపగ్రహ ప్రయోగం
- దాదాపు 36 వేల కి.మీ. ఎత్తులో నిఘా
- సరిహద్దులు, తీరాలపై నిఘాకు ఉపయోగం

# రవాణా పేరుతో యూరియా

# బస్తాలపై అధిక దోపిడి!

### రైతులపై అదనపు భారం.. నిబంధనలకు విరుద్ధంగా వసూళ్ల ఆరోపణలు

**తెలంగాణ అడ్డా, శ్రీప్రాంతంరి :** రైతులకు అత్యవసరమైన యూరియా ఎరువుల విషయంలో రవాణా పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో యూరియా బస్తాపై నిర్ణయించిన ధరకు అదనంగా రవాణా, హమాలీ తదితర పేర్లతో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో యూరియాకు డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితిని కొందరు వ్యాపారులు, సరఫరాదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణయించిన ధరకు మాత్రమే యూరియా విక్రయించాల్సి ఉన్నప్పటికీ, రవాణా ఖర్చుల పేరుతో అదనపు భారం మోపుతున్నారని రైతులు చెబుతున్నారు.

**అధికారులు దృష్టి సారించాలి**

యూరియా విక్రయ కేంద్రాల్లో ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు, రైతుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్న వారిపై అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రవాణా పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులపై అదనపు భారం పడకుండా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



# భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం

- అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలు లేకపోవడం సరికాదు: చంద్రబాబు
- వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో కనిపించని మంత్రి నిమ్మల ఫొటో
- నిమ్మల ఫొటోను ముద్రించకపోవడాన్ని తప్పుబట్టిన చంద్రబాబు



2లో

ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటుచేసుకోవడంపై ఏపీ

## ఆ ఘనత వైఎస్సార్‌దే



- వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పవన్ పాత వీడియోను తెరపైకి తెచ్చిన కాంగ్రెస్
- సెజ్‌ల ఏర్పాటు ఘనత వైఎస్సార్‌దేనని పవన్ చెప్పిన మాటల ప్రస్తావన
- గతేడాది కాకినాడ సభలో డిప్యూటీ సీఎం పవన్ చేసిన వ్యాఖ్యలివి
- వైఎస్సార్ చేసిన పనుల బలాన్ని పవన్ మాటలే చెబుతున్నాయన్న కాంగ్రెస్ - మిగతా 2 లో

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు



- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ

రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, - మిగతా 2 లో

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం
శుక్రవారం 04-09-2026

# దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు అసద్ తక్కువేమీ కాదు: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి – తాను తప్ప మరెవరూ రాలేదన్నారు.

**అసద్ చెప్పిన పనులకు వెంటనే అనుమతులు**

ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏది సూచించినా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు రేవంత్ చెప్పారు. పాతబస్తీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

**హిందూ, ముస్లింలు కలిసి ఉండాలి**

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

# జైశంకర్‌తో భేటీ.. భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు!

మొదటిపేజీ తరువాయి – ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు. జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది. భారత్–ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు. జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

# 'వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది'

మొదటిపేజీ తరువాయి – అమెరికా–ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్‌పై తమ నిఘా ఎంత పకడ్బందీగా ఉందో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇరాన్‌లో ఏం జరుగుతుందో తమకు ఎప్పటికప్పుడు తెలుస్తోందన్నారు. అవసరమైతే ఎప్పుడైనా మరో దాడి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఓవల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్.. తాజా ఘర్షణ ఎక్కువ కాలం సాగదని అభిప్రాయపడ్డారు. ఇరాన్ కదలికలపై అమెరికాకు పూర్తి సమాచారం ఉందన్నారు. "వాళ్లు బాత్‌రూమ్‌కు వెళ్లినా మాకు తెలిసిపోతుంది" అంటూ అమెరికా నిఘా సామర్థ్యాన్ని వివరించారు. హార్మూజ్ జలసంధిపై తమకు బలమైన పట్టు ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇరాన్ ఏర్పాటు చేస్తున్న రాడార్, క్షిపణి వ్యవస్థలను అమెరికా గుర్తించిందన్నారు. సముద్రంలో మైన్స్ వేసేందుకు ఇరాన్ సిద్ధం చేస్తున్న రాకెట్‌ను దాడిలో ధ్వంసం చేశామని చెప్పారు. తాజా అమెరికా దాడుల్లో ఇరాన్‌లో కనీసం 18 మంది చనిపోయారు. మరో 108 మంది గాయపడ్డారు. హార్మూజ్ సమీపంలోని కుహెస్తాక్‌లో జరిగిన వివాహ వేడుకపై కూడా దాడి జరిగినట్లు టెహ్రాన్ తెలిపింది. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా ఎదురుదాడులకు దిగింది. కువైట్, జోర్డాన్, యూఏఈ, బహ్రెయిన్, ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతాల్లో ఉన్న అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లో ఇరాన్ నుంచి వచ్చిన క్షిపణి, డ్రోన్ దాడిని అడ్డుకున్నట్లు అక్కడి సైన్యం తెలిపింది.

# అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

మొదటిపేజీ తరువాయి – రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

# భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకూడదని ఆదేశం

మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫొటోలు లేకపోవడం తీవ్రమైన పొరపాటని, ఇది ఏమాత్రం సరికాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ప్రకటనల్లో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఫొటోను ముద్రించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా కఠిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో, అత్యంత సంక్లిష్టమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన జలవనరుల శాఖ, ఆర్థిక శాఖ అధికారుల సమన్వయాన్ని సీఎం అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిత్యం ప్రాజెక్టుల వద్దే ఉంటూ, ఎంతో నిరాడంబరతతో పనిచేస్తూ ఫలితాలు సాధిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీ ఉత్పత్తులను రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో తీవ్రరూపం దాలుస్తున్న ఎల్‌నినో పరిణామాలపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా అత్యంత స్వల్ప వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర తీవ్ర వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై ఈరోజే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఒక్క ఎకరా పంట కూడా ఎండిపోకూడదని, భూగర్భ జలాల ఆధారంగా అవసరమైతే అదనపు బోర్లు వేసేందుకు తక్షణ అనుమతులు ఇవ్వాలని అన్నారు.

# రామ మందిర ట్రస్టుకు కొత్త సీఈవో... స్పందించిన అసదుద్దీన్ ఒవైసీ

మొదటిపేజీ తరువాయి – అవకతవకలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇచ్చిన నివేదికను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ కేంద్రాన్ని ప్రశ్నించారు. ప్రజల విశ్వాసాన్ని అపహాస్యం చేయడంతో వారు ఆగ్రహంగా ఉన్నారని ఆయన అన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఒవైసీ మీడియాతో మాట్లాడారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు తొలి సీఈవోగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నియమించడంపై ఒవైసీ స్పందించారు. "గతంలో చేసిన నియామకాలు ఎవరు చేశారు? ప్రభుత్వమే కదా? పార్లమెంటులో బిల్లు పెట్టి ట్రస్టును ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కూడా కోట్లాది రూపాయల దొంగతనం జరిగింది. ఇప్పుడు ఎవరిని నియమించుకున్నా అది ప్రభుత్వ ఇష్టమే. కానీ, ఆ దొంగతనం ఎవరు చేశారో ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు" అని అన్నారు.

ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదై, నివేదిక కూడా సిద్ధంగా ఉన్నప్పుడు దానిని ఎందుకు బయటపెట్టడం లేదని ఆయన నిలదీశారు. నమ్మకం పేరుతో ఓట్లు, అధికారం సంపాదించి కొందరు అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు.

**ఓటర్ల జాబితాపై సూచనలు**

తెలంగాణలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలోనూ అవకతవకలు జరుగుతున్నాయని ఒవైసీ అన్నారు. మ్యాపింగ్‌లో తేడాలు, ఒకే కుటుంబంలో ఆరుగురికి పైగా ఓటర్లు ఉన్న సందర్భాల్లో నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి నోటీసులు అందుకున్న వారు వెంటనే విచారణకు హాజరై ఆధార్ కార్డు, ఇతర పత్రాలను సమర్పించాలని సూచించారు. కొందరు ఓటర్లు బతికి ఉన్నా, తమ చిరునామాలోనే నివసిస్తున్నా, చనిపోయినట్లుగా లేదా వేరే ప్రాంతానికి మారినట్లుగా తప్పుగా నమోదు చేస్తున్నారని ఫిర్యాదులను ప్రస్తావించారు.

# మోదీని అడిగే దమ్ముందా?.. తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్

మొదటిపేజీ తరువాయి – తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# 36 వేల కి.మీ ఎత్తు నుంచి భారత్‌పై నిఘా

మొదటిపేజీ తరువాయి – దాదాపు ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. వరుసగా రెండు పీఎస్ఎల్‌వీ ప్రయోగాలు విఫలమైన నేపథ్యంలో.. ఈసారి జీఎస్ఎల్‌వీ–ఎఫ్17తో ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపట్టనుంది. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మిషన్‌లో ఈఓఎస్–05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులో పనిచేసే ఈ ఉపగ్రహం.. భారత్‌కు ఆకాశం నుంచి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుంది. దేశ భూభాగం, తీరప్రాంతాలు, వాతావరణ వ్యవస్థలు, విపత్తులకు గురయ్యే ప్రాంతాలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఇది ఉపయోగపడుతుంది. హై రిజల్యూషన్ కెమెరా ద్వారా సరిహద్దుల భద్రతకు కూడా తోడ్పడనుంది. ఈఓఎస్–05ను సబ్–జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టేలా మిషన్‌ను రూపొందించారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి పనిచేసే తొలి భారతీయ ఇమేజింగ్ శాటిలైట్‌గా ఈఓఎస్–05 ప్రత్యేకత సాధించనుంది. దీని ప్రయోగ బరువు సుమారు 2,367 కిలోలు. ఈ ప్రయోగానికి ఉపయోగిస్తున్న జీఎస్ఎల్‌వీ–ఎఫ్17 రాకెట్ 51.7 మీటర్ల ఎత్తు ఉంటుంది. లిఫ్టాఫ్ సమయంలో దాని బరువు 420.5 టన్నులు. మూడు దశలతో రూపొందిన ఈ రాకెట్‌లో 4 మీటర్ల వ్యాసం ఉన్న పేలోడ్ ఫెయిరింగ్ ఉంటుంది. మొదటి దశలో భారీ ఎస్–139 ఘన ఇంధన మోటార్‌తో పాటు నాలుగు ద్రవ ఇంధన బూస్టర్లు పనిచేస్తాయి. ఎస్–139లోనే 138 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. నాలుగు బూస్టర్లలో కలిపి సుమారు 170 టన్నుల యూహెచ్25, నైట్రోజన్ టెట్రాక్సైడ్ ఇంధనాలు ఉంటాయి. రెండో దశలో ద్రవ ఇంధన సాంకేతికతను ఉపయోగించారు. ఇందులో 42 టన్నుల యూహెచ్25, డైనైట్రోజన్ టెట్రాక్సైడ్ ఉంటాయి. చివరి దశలో భారతీయ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ సీయూఎస్–5 కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో లిక్విడ్ హైడ్రోజన్, లిక్విడ్ ఆక్సిజన్‌తో కలిపి 15 టన్నుల క్రయోజెనిక్ ఇంధనం ఉంటుంది. ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. ఆ తర్వాత భూమిపైకి నిరంతర నిఘా అందించే ఈ 'హాక్ ఐ' తన అసలు పని మొదలుపెట్టనుంది.

# 'ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు'

మొదటిపేజీ తరువాయి – ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

"భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు.

**ఆంక్షల విషయంలో వెనక్కి తగ్గేది లేదు**

అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు.



**ఇరాన్‌కు అణ్వస్త్రం దక్కనివ్వం**

ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# సావర్కర్‌కు ముస్లింలంటే ద్వేషం లేదు

మొదటిపేజీ తరువాయి – పురోభివృద్ధికి తన రచనల్లో దిశానిర్దేశం చేశారని ఆయన మనవడు సాత్యకి సావర్కర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను తీవ్ర ముస్లిం ద్వేషిగా చిత్రీకరించారని ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీపై సాత్యకి దాఖలు చేసిన పరువునష్టం దావాకు సంబంధించి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సాత్యకిని అడ్వకేట్ మిలింద్ పవార్ క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. 2023లో లండన్‌లో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "సావర్కర్ తన ఐదారుగురు స్నేహితులతో కలిసి ఒక ముస్లిం యువకుడిపై దాడి చేసి ఆనందం పొందానని తన పుస్తకంలో రాసుకున్నారు" అని అన్నట్లు సాత్యకి గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా సావర్కర్‌ను ఒక మూకదాడికి పాల్పడే వ్యక్తిగా చూపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ మాటల వల్ల సావర్కర్‌ను తీవ్ర ముస్లిం వ్యతిరేకిగా చిత్రీకరించారు. కానీ ఆయనెప్పుడూ ముస్లింలను ద్వేషించలేదు. తన రచనల్లో వారి అభివృద్ధికి మార్గాలు సూచించారు" అని సాత్యకి కోర్టుకు వివరించారు. రాహుల్ గాంధీ పేర్కొన్నట్లుగా ముస్లిం యువకుడిపై దాడి జరిగిన ఘటన సావర్కర్ రాసిన ఏ పుస్తకంలోనూ లేదని ఫిర్యాదుదారు స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోంది.

# విమానయాన సంస్థలకు జెలెన్‌స్కీ హెచ్చరిక.. ఉగ్రవాదులతో చర్చలు ఉండవన్న పుతిన్

మొదటిపేజీ తరువాయి – చేయడానికి సిద్ధమైనట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఏ క్షణంలోనైనా ఈ దాడులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున రష్యా గగనతలం పౌర విమానయానానికి ఎంతమాత్రం సురక్షితం కాదని, మాస్కోలోని విమానాశ్రయాలు కూడా తమ లక్ష్యాలలో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. పౌర విమానాలు తమ టార్గెట్ కాదనే ఉద్దేశంతోనే ముందస్తుగా ఈ బహిరంగ హెచ్చరిక జారీ చేశామని, అంతర్జాతీయ విమానయాన సంస్థలు, విదేశీ ప్రభుత్వాలు ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించి ఆ ప్రాంతంలో ప్రయాణాలను తక్షణమే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. రష్యా స్వయంగా ప్రారంభించిన యుద్ధం వల్లే నేడు ఆ దేశానికి ఈ దుస్థితి ఎదురైందని ఆయన వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ చేసిన ఈ బహిరంగ హెచ్చరికలపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉక్రెయిన్ వైఖరి ఉగ్రవాదుల తీరును తలపిస్తోందని ఆరోపించారు. అంతర్జాతీయంగా తమపై ఎంత ఒత్తిడి వచ్చినా, ఉగ్రవాద తరహా చర్యలకు పాల్పడుతున్నవారితో ఎలాంటి చర్చలు జరిపే ప్రసక్తే లేదని పుతిన్ తెగేసి చెప్పారు. ఈ పరిణామాల మధ్యనే మంగళవారం రాత్రి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా జరిపిన విధ్వంసకర దాడుల్లో 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మరోవైపు, రష్యా సైన్యంలో చేరిన 51 మంది భారతీయులు ఈ యుద్ధంలో మృతి చెందినట్లు వెలువడిన వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి.

# 'ఆ ఘనత వైఎస్సార్‌దే'.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఒక ఆసక్తికరమైన రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించింది. ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్, గతంలో వైఎస్సార్ పాలనపై చేసిన ప్రశంసల వీడియోను కాంగ్రెస్ పార్టీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. వైఎస్సార్ చేసిన అభివృద్ధి పనుల ప్రభావం ఎంత బలంగా ఉందో చెప్పడానికి, రాజకీయ ప్రత్యర్థి అయిన పవన్ కల్యాణ్ మాటలనే ఉదాహరణగా చూపడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**కాంగ్రెస్ ట్వీట్‌లో ఏముంది?**

"రాజకీయాలు ఎలా ఉన్నా.. వైఎస్సార్ చేసిన పని ఎంత బలంగా ఉందో, ఈ మాటలే చెబుతున్నాయి" అనే వ్యాఖ్యతో కాంగ్రెస్ పార్టీ ఈ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "2005 నుంచి నక్కపల్లి సెజ్‌ను వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారే ప్రారంభించారు. ఇది జనసేన కానీ, మిగిలిన పార్టీలు కానీ చేసింది కాదు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారే ఈ సెజ్‌ను ప్రతిపాదించి తీసుకొచ్చారు" అని స్పష్టంగా పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి కోసం వైఎస్సార్ 'ప్రత్యేక ఆర్థిక మండళ్ల'ను (సెజ్‌లు) ఏర్పాటు చేసిన తీరును స్వయంగా పవన్ కల్యాణే అంగీకరించారని కాంగ్రెస్ పార్టీ ఈ ట్వీట్ ద్వారా చెప్పకనే చెప్పింది. వైఎస్సార్ దార్శనికతకు ప్రత్యర్థుల ప్రశంసలే నిదర్శనమని ఆ పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

**ఆ వీడియో ఎప్పటిది?**



కాంగ్రెస్ ఇప్పుడు పంచుకున్న ఈ వీడియో క్లిప్ గతేడాది అక్టోబర్ నెల నాటిది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లాలో పర్యటించినప్పుడు, ఉప్పాడలో మత్స్యకారుల కోసం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆ సభలో స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ, మత్స్యకారుల ఆందోళనలపై స్పందించారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాల వల్ల మత్స్య సంపద దెబ్బతింటోందని, దానిపై సరైన ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆ ప్రాంతంలోని పారిశ్రామిక అభివృద్ధి చరిత్రను వివరిస్తూ, నక్కపల్లి సెజ్‌ను వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే ప్రారంభించారనే వాస్తవాన్ని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. మొత్తం మీద వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ.. రాజకీయ ప్రత్యర్థి అయిన పవన్ కల్యాణ్ పాత వ్యాఖ్యలనే తమకు అనుకూలంగా మార్చుకుని సోషల్ మీడియాలో ప్రచారానికి ఉపయోగించుకోవడం విశేషం. ఈ వ్యూహం ద్వారా వైఎస్సార్ వారసత్వాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ రాజకీయ చర్చకు దారితీసింది.

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం
శుక్రవారం 04-09-2026

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి 1000 రోజులు

## గుమ్మడిదల మండల కేంద్రములో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



**తెలంగాణ అడ్డా /ప్రతినిధి (3) పటాన్‌చెరు:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గుమ్మడిదలలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు గారి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుమ్మడిదల మండల కేంద్రము లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, స్వీట్లు పంపిణీ చేసారు ఈ సందర్భంగా పుట్ట నర్సింగ్ రావు గారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తోందని తెలిపారు. ఆత్మ కమిటీ చైర్మన్ కొత్త పల్లి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కమిటీల చైర్మన్ లు,కౌన్సిలర్ల్, సర్పంచ్ లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, అన్ని గ్రామాల అధ్యక్షులు,కార్యకర్తలు,కే యస్ జి యువసేన అధ్యక్షులు పాల్గొన్నారు

# బస్తీ బాట'లో విద్యుత్ పోలెక్కి భద్రతా ప్రమాణాలను పరిశీలించిన టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్



**సిద్ధిపేట ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసిఎల్) సీఎండీ మరియు ఐఏఎస్ అధికారి జితేష్ వి. పాటిల్ 'బస్తీ బాట' కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల సెక్షన్ పరిధిలోని మల్కారం గ్రామంలో పర్యటించి విద్యుత్ భద్రతా ప్రమాణాలను స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది భద్రతను పర్యవేక్షించడానికి ఆయన స్వయంగా విద్యుత్ పోలెక్కి అక్కడ అనుసరిస్తున్న భద్రతా పద్ధతులను పరిశీలించడం విశేషం. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి, విద్యుత్ లైన్లు మరియు పోల్స్‌పై విధులు నిర్వహించేటప్పుడు సిబ్బంది ఎదుర్కొంటున్న సవాళ్లను ఆయన స్వయంగా తెలుసుకున్నారు. వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ), సేఫ్టీ సామాగ్రి మరియు ముందస్తు జాగ్రత్తల వినియోగాన్ని పరిశీలించిన సీఎండీ, ప్రతి క్షేత్రస్థాయి కార్యకలాపంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉద్యోగుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని, సిబ్బంది అందరూ విధిగా భద్రతా నియమాలను పాటించడంతో పాటు పీపీఈ కిట్లను తప్పనిసరిగా ఉపయోగించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో సీఎండీ స్వయంగా పాల్గొనడం ద్వారా, నిజమైన నాయకత్వం అంటే కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండటం, ఆదర్శంగా నిలవడం అని జితేష్ వి. పాటిల్ నిరూపించారు. నాయకత్వం తన ఉద్యోగులకు ఎప్పుడూ అండగా నిలుస్తుందని, వారి సవాళ్లను అర్థం చేసుకుంటూ వారి ప్రాణాలు, భద్రతను అన్నింటికంటే ముఖ్యమైనదిగా భావిస్తుందనే బలమైన సందేశాన్ని ఆయన కార్మికవర్గానికి అందించారు.

# వేములవాడలో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ర్యాలీ.. కేసీఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్




**వేములవాడ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్ రాజీనామా డిమాండ్ చేస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సుమారు ఐదు వందల మీటర్ల మేర గత బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలు మరియు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ భారీ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి అనుకూలంగా, ప్రతిపక్షానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు కల్వకుంట్ల కుటుంబం ఎంతో బాకీ ఉందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దులలా ముందుకు తీసుకుపోతుంటే, బీఆర్ఎస్ నాయకులు జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి బావ, బామ్మర్దులు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే తీరిక లేని కేసీఆర్ వెంటనే తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలన కేవలం ఫామ్ హౌస్ పాలన అని, కాంగ్రెస్ పాలన మాత్రమే ప్రజల సంక్షేమాన్ని కాపాడే నిజమైన ప్రజా పాలన అని నాయకులు స్పష్టం చేశారు.

# గణపతి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.. రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశం



**రామగుండం ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** రామగుండం నియోజకవర్గంలో త్వరలో జరగనున్న గణపతి ఉత్సవాల ఏర్పాట్లపై రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, అదనపు కలెక్టర్ జల్ద అరుణ శ్రీ, కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి తదితరులు పాల్గొన్నారు. గణపతి ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శానిటేషన్, రోడ్లు, వీధి దీపాలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు తదితర అన్ని సౌకర్యాలను ముందస్తుగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వినాయక మండపాల ఏర్పాటులో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ సరఫరా కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎంసీబీ (వీజదీ)లను ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ భద్రతపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. ఉత్సవాల మొదటి రోజు నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్, మున్సిపల్ అధికారులు, తహశీల్దార్ (వీ=ా), టీఎస్ఎన్‌పీడీసీఎల్ (ూచీూణజూ), ఆర్ఎఫ్‌సీఎల్ (=ఖీజూ), ఎన్టీపీసీ (చీూజ), సింగరేణి అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు మరియు కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీది 6 గ్యారంటీలు 420 హామీలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

**(తెలంగాణ అడ్డా టేక్మాల్ ప్రతినిధి ):** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు టేక్మాల్ మండల కేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో బి ఆర్ యస్ నాయకులు కార్యకర్తలు, ప్రజలతో కలిసి ముందుగా టేక్మాల్ చౌరస్తా లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహనికి పూల మాల వేసిన అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలతో కూడిన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు హోరెత్తించాయి. తెలంగాణలో అబద్ధపు హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో కనీసం ఒక్కటంటే




ఒక్కటి కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. అన్నదాతలను ఆదుకుంటామన్న కాంగ్రెస్ సర్కార్, రైతు భీమా పథకానికి తూట్లు పొడిచి మోసం చేసిందన్నారు పేదింటి ఆడబిడ్డకు అండగా నిలవాల్సిన 'కల్యాణ లక్ష్మి' పథకాన్ని తుంగలో తొక్కారు. చదువుకునే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక వారి భవిష్యత్తును అగమ్యగోచరంలోకి నెట్టారు రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా కష్టాలు మిగిలాయి ఆసరా పెన్షన్ల పెంపుదల జాడ లేదు. యువతులకు స్కూటీలు ఇస్తామన్న హామీ నీటి మీద రాతలయ్యాయనీ అన్ని రంగాల్లోనూ ఘోరంగా విఫలమైన ఈ ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు బీఆర్ఎస్ పార్టీ తరుపున ప్రశ్నిస్తూనే ఉంటామనిమాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారెంటీలు 420 హామీల మోసాన్ని రాబోయే అసెంబ్లీ వేదికగా గట్టిగా ఎత్తిచూపుతామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే వరకు ప్రజల పక్షాన నిలబడి తీవ్ర పోరాటాలు చేస్తామని సర్కార్‌ను నిలదీశారు, ఈ కార్యక్రమంలో బి ఆర్ యస్ పార్టీ మండల అధ్యక్షుడు, వీరప్ప, స్వప్న రవి, యశ్వంత్ రెడ్డి, సలీం జైపాల్ రెడ్డి, సుప్రజ భాస్కర్, అక్బర్ పాషా, సలీమ్,సిద్దయ్య,వరలక్ష్మి, శ్రవణ్, మండల బి ఆర్ యస్ నాయకులు,యూవకులు కార్యకర్తలు పెద్ద ఎత్తునపాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు హాజరైన అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** భగవంతుణ్ణి అన్నివేళల్లో కొలిచిన వారికి సుఖసంతోషాలతో పాటు అనేక రకాలైన లాభాలు కలుగుతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల, వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ మరియు మంకమ్మతోటలోని అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్ పాఠశాలల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వి. నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. దేశవ్యాప్తంగా జన్మాష్టమి వేడుకలను ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారని, ఈ పూజలకు కుటుంబ సమేతంగా హాజరై ఆధ్యాత్మికతను పెంపొందించుకుంటారని ఆయన పేర్కొన్నారు. తెల్లవారుజామున విశేష అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక అర్చనలు నిర్వహిస్తారని, సాయంత్రం సమయంలో యువకుల కోలాహలం మధ్య ఉట్టికొట్టే కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటారని చెప్పారు. పిల్లల కోసం శ్రీకృష్ణుని వేషధారణ పోటీలు, భక్తి సంగీత కార్యక్రమాలు ఎంతగానో ఆనందాన్ని ఇస్తాయన్నారు. ద్వాపర యుగంలో మధురానగరంలో కంసుడి దేవకి, వసుదేవుల అష్టమ గర్భంగా శ్రావణమాసం బహుళపక్ష అష్టమి తిథి మరియు రోహిణి నక్షత్రం కలయికలో అర్ధరాత్రి వేళ లోక కల్యాణం కోసం శ్రీకృష్ణుడు భూమిపై అవతరించాడని నరేందర్ రెడ్డి గుర్తుచేశారు. ఈ వేడుకలను పురస్కరించుకుని బాలకృష్ణునికి అత్యంత ప్రీతిపాత్రమైన పాలమీగడ, వెన్న, పెరుగుతో పాటు అటుకుల ప్రసాదం, శనగపప్పు వడలను నైవేద్యంగా సమర్పిస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్య ప్రదర్శనలు, ముఖ్యంగా శ్రీకృష్ణ మహాత్యం, శ్రీకృష్ణ లీలలను తలపించే ఘట్టాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు అసెంబ్లీకి రావాలి బీఆర్ఎస్ నాయకులకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్

**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** రాష్ట్రంలో వెయ్యి రోజుల ప్రజాపాలనలో జరిగిన అభివృద్ధిపై, కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అవినీతి ఆరోపణలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్‌రావులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కూడా అసెంబ్లీకి తీసుకొచ్చి చర్చలో పాల్గొనాలని ఆయన డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, 2023 డిసెంబర్‌లో రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొని ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని గుర్తుచేశారు. వెయ్యి రోజులుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని



మండిపడ్డారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీని కేటీఆర్, హరీష్‌రావు ఏకవచనంతో సంబోధించడం వారి అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో నాలుగు గ్యారెంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మిగతా రెండు గ్యారెంటీలను కూడా అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు నూతన రేషన్ కార్డులు అందజేయడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు రాష్ట్రంలోని నూట పంతొమ్మిది (119) నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి మూడు వేల ఐదు వందల (3,500) చొప్పున ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు.

# చట్టబద్ధ దత్తత ప్రక్రియే తప్పనిసరి

## తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ




**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాస వ్యవస్థల పనితీరుపై తెలంగాణ హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రెండు నెలల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లు వస్తున్న ఆరోపణలు, నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం తీవ్రంగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో డీఎన్ఏ నమూనాల సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని హోంశాఖను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని స్పష్టం చేసింది.

**కేసు నేపథ్యం మరియు విచారణ వివరాలు:** నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం. వెంకన్న దంపతులు 2023లో దత్తత తీసుకున్న చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ సింగిల జడ్జి పిటిషన్‌ను కొట్టివేయడంతో వారు అప్పీల్‌కు వెళ్లారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయి వర్చువల్‌గా హాజరై వివరాలు అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు సీనియర్ న్యాయవాది బి. మయూర్‌రెడ్డిని అమికస్ క్యూరీగా నియమించిన ధర్మాసనం, విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

**రాష్ట్రంలో సంక్షేమ గృహాల వివరాలు:** ఈ విచారణ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా కోర్టుకు పలు వివరాలు తెలిపారు. అన్ని జిల్లాల్లో రెండు నెలల్లోగా సీడబ్ల్యూసీ (జఔజ) పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం రెండు వందల తొంబై ఒకటి (291) బాలల సంక్షేమ గృహాలుండగా, వాటిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అరవై (60), ప్రైవేటు ఆధ్వర్యంలో రెండు వందల ముప్పై ఒకటి (231) నడుస్తున్నాయని చెప్పారు. నేరాలకు పాల్పడిన, శిక్ష పడిన బాలల కోసం ప్రత్యేకంగా ముప్పై ఐదు (35) సంరక్షణ కేంద్రాలున్నాయని తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల కోసం పదిహే? (17) ప్రత్యేక దత్తత కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అనాథలుగా దొరికిన లేదా ఎవరైనా అప్పగించిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి ప్రత్యేక దత్తత కేంద్రాల్లో ఉంచుతామని, నిబంధనల ప్రకారం సామాజిక దర్యాప్తు జరిపించి అర్హులైనవారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని వివరించారు. పిల్లల సంక్షేమాన్ని శిశు సంక్షేమ శాఖ చూసుకుంటుందని, కేసుల్లో దర్యాప్తును మాత్రమే తాము చేపడతామని హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్ కోర్టుకు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ పిల్లల సంక్షేమాన్ని తమ శాఖ పర్యవేక్షిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయి పేర్కొన్నారు.

# సంక్షేమ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు.. వారంల ఒకసారి పాఠశాలలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 67 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి, విద్యార్థులకు స్వయంగా షూస్‌తో పాటు బ్యాగులను అందజేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని తహశీల్దార్, ఎంపీడీవోలు విధిగా వారంలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలను, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువులో మరింత రాణించాలని ఆకాంక్షించారు. సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కుమ్మరిపల్లి కస్తూర్బా వసతి గృహాన్ని తాను స్వయంగా ప్రతి నెలా ఒకసారి సందర్శిస్తానని వెల్లడించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. చదువులో మంచి మార్కులు సాధిస్తూ రాణిస్తున్న విద్యార్థులను, వారిని తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల ఆమని, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, వెల్గటూర్ తహశీల్దార్‌తో పాటు పలువురు అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# మంథనిలో భారీగా గుడుంబా బెల్లం పానకం ధ్వంసం రెండు వేల లీటర్ల పానకాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

**రామగుండం ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంథని పట్టణ శివారులో గల నిర్మానుష్య ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన భారీ గుడుంబా బెల్లం పానకాన్ని పోలీసులు గుర్తించారు. నమ్మదగిన సమాచారం మేరకు మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం ఆ ప్రాంతంలో ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో ప్లాస్టిక్ క్యాన్లు, డ్రమ్ముల్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రెండు వేల (2,000) లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు గుర్తించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ పానకం ఎవరికీ అందుబాటులోకి వెళ్లకుండా నిబంధనల ప్రకారం పంచుల సమక్షంలో అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని, గుడుంబాను డంప్ చేసి నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తుల కోసం గాలింపు చర్యలు



చేపట్టామని సీఐ తెలిపారు. అక్రమంగా గుడుంబా తయారీ, నిల్వ, రవాణా లేదా విక్రయాలకు పాల్పడే వారిపై ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా ఆరోగ్యానికి తీవ్ర హానికరమని, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టానికి కూడా దారితీసే ప్రమాదం ఉన్నందున ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని సేవించవద్దని సూచించారు. మంథని సర్కిల్ మరియు పోలీస్ స్టేషన్ పరిధిలో గుడుంబా తయారీ, నిల్వ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ దాడులలో మంథని సర్కిల్ హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణ నాయక్, రమేష్ రావు, కానిస్టేబుళ్లు శివ, అజిత్, సతీష్ మరియు అంజి తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ నియోజకవర్గంలో పెండింగ్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

### రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరిన ప్రజాప్రతినిధి

**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** హుస్నాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వివిధ రహదారులు మరియు భవనాల (ఆర్ అండ్ బీ) శాఖ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే కొత్తగా ప్రతిపాదనలు పంపిన రోడ్లకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరడం జరిగింది. సచివాలయంలో మంత్రిని కలిసి నియోజకవర్గంలోని పలు కీలక రహదారుల అభివృద్ధిపై చర్చించారు. ప్రత్యేకంగా సిద్దిపేట--ఎల్కతుర్తి జాతీయ రహదారి పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, అసంపూర్తిగా ఉన్న కల్వర్టుల నిర్మాణంతో పాటు మిట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ ఓబీ) పనులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్కతుర్తి జంక్షన్ వద్ద కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట వైపు వెళ్లే రహదారులు కలిసే ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ జంక్షన్ వద్ద రహదారిని విస్తరించి బాటిల్‌నెక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే



కరీంనగర్--ఎల్కతుర్తి, ఎల్కతుర్తి--హనుమకొండ మధ్య నగుతున్న రోడ్డు పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి మెరుగైన రోడ్డు రవాణా మౌలిక వసతులు అత్యంత కీలకమని తెలిపారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించడంతో పాటు, కొత్త రోడ్ల మంజూరు కోసం నిరంతరం కృషి చేస్తూ వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలకు త్వరలోనే పూర్తి పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు.

# రెవెన్యూ, ఇందిరమ్మ ఇళ్లు, సర్వే రీ సర్వే సమస్యలపై సమగ్ర సమీక్ష



**తెలంగాణ అడ్డా న్యూస్, భద్రాద్రి జిల్లా ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం మరియు ఖమ్మం (ఉమ్మడి ఖమ్మం) జిల్లాల పరిధిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, సర్వే--రీ సర్వే, కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాల సమస్యలు, రెవెన్యూ--అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలపై గురువారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రెండు జిల్లాల పరిధిలోని వివిధ సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరిష్కరించాలని, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల వారీగా సర్వే--రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాలకు సంబంధించిన భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. రెవెన్యూ మరియు అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను గుర్తించి సమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యల కారణంగా సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పినపాక నియోజకవర్గ పరిధిలో రెవెన్యూ, అటవీ సరిహద్దులు, సర్వే--రీ సర్వేకు సంబంధించిన సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో భూములకు సంబంధించిన సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పినపాక నియోజకవర్గంలోని కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాల్లో సర్వే--రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నా రు. రెవెన్యు, అటవీ సరిహద్దులకు సంబంధించి ప్రజలకు స్పష్టత కల్పించడంతో పాటు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్క రించా లని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైనలబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రజల భూ హక్కులు, భూ రికార్డుల విషయంలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సరిహద్దు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో రెండు జిల్లాల పరిధిలోని రెవెన్యూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పరిస్థితి, సర్వే--రీ సర్వే పురోగతి, కేడస్ట్రల్, నాన్ కేడస్ట్రల్ గ్రామాల వివరాలు, రెవెన్యూ--అటవీ సరిహద్దు వివాదాలపై అధికారులు సమగ్ర వివరాలను మంత్రికి, ఎమ్మెల్యేలకు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు కునంనేని సాంబశివరావు , జారే ఆదినారాయణ, కోరం కనకయ్య , రామ్‌దాస్ నాయక్ , తెల్లం వెంకట్రావు , మట్టా రఘుమయి , జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పీఓ, జిల్లా ఎస్పీతో పాటు ఖమ్మం జిల్లా మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలి.. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** నిర్దేశిత గడువులోగా సీఎంఆర్ (CMR) డెలివరీ ప్రక్రియను పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గత రెండు సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ డెలివరీ, డిఫాల్ట్ మిల్లర్ల బకాయిల చెల్లింపు మరియు వచ్చే సీజన్‌కు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో ఆమె గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గత రెండు సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ డెలివరీ ప్రక్రియను వేగవంతం చేసి సూచించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే సీజన్‌కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై చర్చించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. డిఫాల్ట్ మిల్లర్లు బకాయిలను కచ్చితంగా చెల్లించాలని, సకాలంలో బకాయిలు చెల్లించని రైస్ మిల్లులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌సీ మెమో కరెక్షన్ సేవలు ఇక మీసేవలో




**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** పది మెమోలో తప్పుల సవరణ కోసం ఇకపై కార్యాలనాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఎస్ఎస్‌సీ మెమో కరెక్షన్ **(SSC Memo Correction)** సేవలను 'మీసేవ' పోర్టల్‌లో అందుబాటులోకి తెచ్చింది. ఈ సేవ ద్వారా విద్యార్థులు తమ ఎస్ఎస్‌సీ మెమోలో పేరు, తల్లిదండ్రుల పేరు, పుట్టిన తేదీ (తేదీ ఆఫ్ బర్త్) తదితర వివరాల సవరణ కోసం సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐసీ లేదా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకునే ఈ విధానం ఎంతో సులభంగా, వేగంగా మరియు పారదర్శకంగా ఉంటుందని, మీ వివరాలు పూర్తిగా సురక్షితంగా ఉంటాయని అధికారులు తెలిపారు.

**గమనిక:** ప్రస్తుతం ఆ పాఠశాల (స్కూల్) ఉంటేనే ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సేవల గురించిన మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ షషష.ఎవవంవఝ్.వశ్రీఖఅస్త్రుఅఖ.స్త్రశీజ.ఱఅ ను సందర్శించవచ్చు.

# శ్రీ వైష్ణవి డయగ్నోస్టిక్స్ సెంటర్‌లో నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్

### సర్టిఫికెట్ కార్యక్రమంలో

**తెలంగాణ అడ్డా ప్రతినిధి (3):** బిఆర్ఎస్ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్గారు పాల్గొని, శిక్షణ పూర్తి చేసుకున్న ల్యాబ్ టెక్నీషియన్లకు అభినందనలు తెలియజేయడం జరిగింది. వైద్య రంగంలో ల్యాబ్ టెక్నీషియన్ల పాత్ర ఎంతో కీలకం. రోగ నిర్ధారణలో ఖచ్చితత్వం, బాధ్యత, సమయపాలనతో పాటు నిరంతర అభ్యాసం, జశీఅంఅర్‌వఅఎఎ మరియు అంకితభావం ప్రతి టెక్నీషియన్‌కు విజయానికి బాటలు వేస్తాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ల్యాబ్ టెక్నీషియన్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ నైపుణ్యాలతో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను.





# కాంగ్రెస్ బాకీ కార్డు లను ప్రజలకు విస్తృతంగా చేరావేయాలి

### నయవంచన కాంగ్రెస్ పాలనను ప్రజల్లో ఏండగాట్టాలి



**తెలంగాణ అడ్డా/ ప్రతినిధి (03):** జిన్నారం మునిసిపల్ పరిధిలో కాంగ్రెస్ బాకీ కార్డు లను వార్డు వైస్ గా పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలతోపాటు 420 హామీలు ఇచ్చి భరోసాకార్డుతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయక పోవడంతో వారిచ్చిన హామీ మేరకు ప్రజలకు ప్రభుత్వం బాకీ పడి, అప్పుల ప్రభుత్వంగా మారిందని, రేవంత్ సర్కార్ సిబిల్ స్కోర్ పడిపోయిందని విమర్శించారు. ప్రజలకు ఇవ్వాల్సిన బాకీలను ఎప్పటి వరకు ఇస్తారో సీఎం రేవంత్‌రెడ్డి గడువు చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్ గారు జిన్నారం మునిసిపల్ చైర్మన్ జనార్ధన్ గారు కౌన్సిలర్ స్, మాజీ సర్పంచ్ లు, గ్రామ కమిటీ అధ్యక్షులు ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ముగిసిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

### ప్రతిభ చాటిన విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలకు అవకాశం
### మూడు రోజుల పాటు ఉత్సాహంగా పోటీలు
### అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్
### అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు
### ప్రతిభ కనబర్చిన వారికి జిల్లా స్థాయిలో అవకాశం

**తెలంగాణ అడ్డా కొనరావుపేట ప్రతినిధి:** మండల స్థాయిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మొదటి రోజు జెడ్పీహెచ్ఎస్ సుద్దాల పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలురకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. రెండో రోజు జెడ్పీహెచ్ఎస్ కనగర్తి పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలికలకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మూడో రోజు బాలబాలికలకు అథ్లెటిక్స్ విభాగంలో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మురళి నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎస్‌జీఎఫ్ పోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసి పంపనున్నట్లు ఎస్‌జీఎఫ్ కన్వీనర్ సంతోష్ తెలిపారు. మూడు రోజుల పాటు క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు



EDITOR, PUBLISHER, OWNER BYGADDI NARESH Published at D.No: 3-82, Rathnampeta, Vilasagar, Rajanna Sirisilla, Karimnagar District, Telangana State pin—505524. Printer Sanam Venkata Rajasekhar, Printed at Arunodaya Printers D.No : 33-5-9, 2nd floor, , Papaiah Street, Seetharamapuram , Vijayawada, Krishna District, Andhra Pradesh pin-52002 Email Telanganadhairyamnewspaper@gmail.com, Cell :9441260616. RNI No: TGTEL/25/A0986